# ఇరుగు - పొరుగు

ఉదయం పక్కమీంచి లేస్తూనే, యాదాలాపంగా కిటికీలోంచి బయటకు చూస్తూ ఓ క్షణం స్పృహ తప్పిపోయినట్టు రాయిలా ఉండిపోయింది, కామాక్షి. రెండో క్షణం నోరు ఓసారి తెరిచి మూసింది. మూడో క్షణం కెవ్వున కేక వేసి, 'ఏమండోయ్! అటు చూడండి' అని మొద్దు నిద్రపోతున్న మొగుణ్ణి ఓ గుద్దు గుద్దింది.

అద్భుత భయానక సన్నివేశాలతో, ఒళ్ళు గగుర్పొడిచే పీడకలలో ఉన్న రామ్మూర్తి ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూసి, ఇంకా పూర్తిగా మెలుకువ రాని అతని కళ్ళకు కామాక్షి కలలోని రాక్షస సుందరిలాగానే కనిపించి, 'నన్నొదిలేసేయ్ బాబోయ్' అన్నాడు మంచం మీంచి దూకుతూ.

రామ్మూర్తికి తెలివొచ్చేలా ఓ సారి గట్టిగా గిల్లి, 'అటు చూడండి' అంది కామాక్షి కిటికీలోంచి బయటకు చూపిస్తూ.

అప్పుడే గేటు తీసుకుని బయటకు వస్తున్న పరమశివాన్ని చూస్తూ, 'పొరుగింటి పుల్లయ్య గొడవ ఎందుకు లేవే' అనబోతున్న రామ్మూర్తి నోరు టక్కున మూసుకు పోయింది. కళ్ళు ఒకసారి నులుముకుని చూశాడు రామ్మూర్తి.

పరమశివం యుద్ధంలోకి వెళ్ళబోయే వీరుడిలా శిరస్త్రాణం చేతిలో పట్టుకుని నిలబడ్డాడు. అతని పక్కన మీనాక్షి వీరగంధం రాయడానికా అన్నట్లు హారతి పళ్ళెంతో నిలబడింది. వారి సుపుత్రుడు, పదేళ్ళ చిట్టిగాడు, పిట్టగోడెక్కి కూర్చుని వినోదం చూస్తున్నాడు.

గేటు ముందు ఇంతటి అల్లకల్లోలానికి కారణభూతమైన కొత్త స్కూటరు తళతళా మెరిసిపోతూ నిలబడి ఉంది.

'రెడీ?' అన్నాడు పరమశివం మీనాక్షి కేసి చూస్తూ.

'ఉండండి' అంటూ ఆవిడ ఎదురింటి కేసి మళ్ళీ చూసింది. బాగా తెల్లారినా ఎదురింటి కామాక్షి ఈ రోజు ఇంకా తలుపులు తెరవలేదు.

'ఒరే చిట్టీ! అత్తయ్యగార్ని ఓ సారి పిలు' అంది మీనాక్షి.

చిట్టిగాడు చెంగున గోడ దూకి ఎదురింట్లోకి పరుగెత్తి, కాలింగు బెల్లు ఫైరింజన్లా గణగణ మోగించాడు. కాని మెలకువగా ఉన్న వాళ్ళని ఫైరింజను కూడా లేపలేదు కాబట్టి కామాక్షి గారింటి తలుపులు తెరుచుకోలేదు.

'ముహూర్తం దాటిపోతోందే!' అన్నాడు పరమశివం విసుగ్గా.

కాలింగ్ బెల్లు మోగినా తలుపులు తెరవలేదంటే కామాక్షి తప్పకుండా లేచి ఏ కిటికీలోంచో చూస్తూనే ఉంటుందని ఊహించి, కిటికీ కేసి చూసి చిరునవ్వు నవ్వి, స్కూటరు ముందు కొబ్బరికాయ ఢామ్మని పగలగొట్టింది. ఓ పెచ్చు ఎగిరి పరమశివం ముక్కును ముద్దు పెట్టుకుంది.

'అమ్మో!' అన్నాడు పరమశివం, రెండు చేతులతోనూ మొహం కప్పుకుని.

కిటికీ దగ్గర కామాక్షి కిసుక్కున నవ్వి, అటు చూడదన్నట్లు మొగుణ్ణి మోచేత్తో డొక్కలో ఓ పోటు పొడిచింది.

'చూస్తున్నాను లేవే! అలా గేదెలా పొడిచెయ్యకు' అన్నాడు రామ్మూర్తి డొక్క పట్టుకుంటూ.

స్కూటరుకి హారతిచ్చి 'ఇక పదండి' అంది మీనాక్షి పరమశివంతో.

హిప్నొటైజు చేయబడినవాడిలా పరమశివం హెల్మెట్ తగిలించుకుని ముందుకు వచ్చి, స్కూటరుకి ఓ కిక్కిచ్చి కూర్చుని, గేరు మార్చి క్లచ్ వదిలాడు. మరుక్షణం ముందు చక్రం గాలిలోకి లేచి ఒంటి చక్రం మీద స్కూటరు బాణంలా దూసుకుపోయి కనుమరుగైపోయింది.

'శివ శివా' అన్నాడు రామ్మూర్తి కళ్ళుమూసుకుని.

'నాన్న సర్కస్ ఫీట్లు చేస్తున్నాడేవ్' అన్నాడు చిట్టిగాడు హుషారుగా.

'నువ్వు లోపలికి నడు వెధవా' అని కొడుకుని మందలించి, గేటు మూసేస్తూ, ఎదురింటి కిటికీ కేసి ఓసారి చూసి, కిటికీ కర్టెన్ రెపరెపలాడటం గమనించి, తృప్తిగా లోపలికి నడిచింది మీనాక్షి.

'చూశారా ఆ గర్వం? బోడి స్కూటరు వాళ్ళకే ఉందా? అయినా ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడే కొన్నప్పుడు – సెంట్రల్ గవర్నమెంటు గెజిటెడ్ ఆఫీసర్ – మీరు కొనలేరా?' అంది కామాక్షి మొగుణ్ణి ఛాలెంజ్ చేస్తున్నట్టు.

రామ్మూర్తి నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది.

ఆవిడ పట్టు చీర కొంటే ఈవిడా కొనెయ్యాలి. ఈవిడ బంగారు గాజులు చేయించుకుంటే ఆవిడా వెంటనే చేయించుకోవాలి. ఆ ఇంట్లో ఫ్రిజ్ వచ్చిన మర్నాడే ఈ ఇంట్లో ఫ్రిజ్ వచ్చి వాలింది. ఈ ఇంట్లో సోఫాసెట్టు వచ్చిన రోజే ఆ ఇంట్లో సోఫా సెట్ దిగింది. ఆ ఇంట్లో కలర్ టీవీ రాగానే, ఈ ఇంట్లోనూ కలర్ టీవీ వచ్చింది. ఈ పోటీ కొత్తదేమీ కాదు కాని ఇప్పుడు...

'ఏం మాట్లాడరేం?' – కామాక్షి గదమాయించింది.

'నాకు భయం' అన్నాడు రామ్మూర్తి కొంచెం కోలుకుని.

'భయం దేనికి?'

'నాకు బిజీ రోడ్ల మీద స్కూటరు నడపడం భయమే' అన్నాడు రామ్మూర్తి భయం భయంగా.

'సెంట్రల్ గవర్నమెంటులో గెజిటెడ్ ఆఫీసరు – స్కూటరు నడపడం రాదంటే ఎవరేనా నవ్వుతారు'

'నీ మొహంలా ఉంది. ఇంత లావున్నావు, తేలు మంత్రం రాదా? అన్నాడట వెనకటికొకడు. గెజిటెడ్ ఆఫీసర్ కావడానికి, స్కూటరు నడపడానికి సంబంధం ఏవిటే?'

'ఏది ఏవైనా రేపటికల్లా స్కూటరు రావాల్సిందే' అని ఆర్డరు వేసి విసురుగా వంటింట్లోకి నడిచింది కామాక్షి – 'నేను చచ్చిపోయాను దేవుడోయ్' అని రామ్మూర్తి సైలెంటుగా గోల పెడుతుండగా...

✧ ✧ ✧

అరగంట తర్వాత మళ్ళీ బెల్లు మోగుతుంటే అప్పుడే లేచినట్లు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, ఆవులిస్తూ, తలుపు తీసింది కామాక్షి.

'వదిన గారు ఇంత పొద్దెక్కినా లేవకపోతే ఏవిటా అని కంగారుపడి వచ్చాను. ఒంట్లో బాగాలేదా' అంది మీనాక్షి ఆత్రత నటిస్తూ.

'నీ తలకాయ. నీ కంగారెందుకో నాకు తెలియదా' అని మనసులో అనుకుని, 'ఏదో! తలనొప్పిగా ఉంటే...' అంది కామాక్షి నీరసంగా కణతలు నొక్కుకుంటూ.

'నీ తలనొప్పికి కారణం నాకు తెలియదా' అన్నట్లు చూసి, ఓ వంకర నవ్వు నవ్వి, 'వెళ్ళొస్తా' అని వెళ్ళబోతుండగా రంయిన స్కూటరు వచ్చి ఆగింది.

ఆ టైమింగుకి సంతోషించి, మొగుడికేసి ప్రేమగా ఓసారి చూసి, 'అన్నట్లు వదినగారూ, మేం స్కూటరు కొన్నాం' అంది మీనాక్షి, కామాక్షి కళ్ళల్లో ఏ భావం మెదులుతుందా అని జాగ్రత్తగా, పరిశీలనగా చూస్తూ.

'ఓహో!' అంది కామాక్షి. రాతి బొమ్మ కూడా ఏ ఎక్స్‌ప్రెషనూ లేకుండా అలా 'ఓహో!' అనలేదు.

పరమశివం స్కూటరు ఆగాక, ఓ నిమిషం అలాగే కూర్చుండిపోయాడు. మంటల్లో మోటారు సైకిలు నడిపిన వాడిలా ఉంది అతని పరిస్థితి. చచ్చిపోకుండా ప్రాణాలతో ఎలా తిరిగొచ్చానా అని తను బతికున్నందుకు అతనికే ఆశ్చర్యంగా ఉంది. ఆ ఆశ్చర్యం మెల్లిగా ఆనందంగా మారి 'ఓయ్' అని కేక వేసి స్కూటరు మీంచి కిందకు దూకి ఎదురింటివైపు పరుగెత్తి 'గురూగారు ఇంకా లేవలేదా' అనడిగాడు హుషారుగా.

ఆ హుషారును గర్వంగా అపార్థం చేసుకున్న కామాక్షి 'లేవలేదనుకుంటా' అని అనబోతుండగా, 'ఎందుకు లేవలేదూ? చాలా సేపైంది – ఆహా – స్కూటరు కొన్నావా? గుడ్! గుడ్!' అంటూ బ్రష్ నోట్లో పెట్టుకుని స్కూటరు చూడ్డానికి వెళ్ళబోతుండగా, గుమ్మం దగ్గర కామాక్షి కాలు పైకి లేచి ధన్‌మని రామ్మూర్తి కాలుమీద దిగింది.

'ఏవిటే అలా చిందులు తొక్కేస్తున్నావు' అనబోయి, ఆవిడ ఎర్రటి కళ్ళల్లో వార్నింగు చదివేసి, మొహం ముడుచుకుని లోపలకు వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

రామ్మూర్తి లోపలకి వెళ్ళాడో లేదో 'కిట్టిగాడు ఇంకా లేవలేదా ఆంటీ?' అంటూ రంగంలోకి దిగాడు చిట్టిగాడు.

'రా నాయనా! నువ్వొక్కడివే తక్కువయ్యావు' అని మనసులో అనుకుని, 'ఇంకా లేవలేదురా' అంది కామాక్షి.

'ఏం? వాడికీ తలనొప్పా?' అంది మీనాక్షి రెండర్థాలు వచ్చేలా.

'వాడికి తలనొప్పి కాదు – ఒళ్ళు నొప్పులు. నిన్న క్లాసు టీచరు వాణ్ణి సూపర్‌రిన్‌తో ఉతికేసిందిగా' అన్నాడు చిట్టిగాడు.

'ఎందుకు?' – పొరపాటున, అప్రయత్నంగా నోరు తెరిచి అడిగింది కామాక్షి. కిట్టిగాడు స్కూల్లో దెబ్బలు తిన్న విషయం ఆవిడకి చెప్పలేదు.

'ఎందుకేవిటి ఆంటీ? వాడు క్లాసులో లాస్టునుంచి ఫస్ట్ వస్తే టీచరుకు సంతోషం వేసి వాణ్ణి సన్మానించేసింది'.

మీనాక్షి చిట్టిగాడికేసి ప్రేమగా చూసి, 'రా నాన్నా! నువ్వు బాగా చదివి మీ నాన్నగారిలా ఏ పెద్ద కంపెనీలోనో ఉద్యోగం చెయ్యాలి. లేకపోతే గవర్నమెంట్‌లో పడి రాట్ అయిపోవాలి. రా అమ్మా!' అని గోరు చుట్టుమీద ఓ రోకటి పోటు పొడిచి వెళ్ళిపోయింది.

మీనాక్షి వెళ్ళగానే విసురుగా తలుపేసి, చీపురు తీసుకుని, మంచంమీద ఓ మూల కుక్క పిల్లలా ముడుచుకు పడుకున్న కిట్టిగాణ్ణి ఓ దెబ్బ వేసి 'లే వెధవా' అంది కామాక్షి.

కిట్టిగాడు చురుకైనవాడు. అంత నిద్రమత్తులోనూ కళ్ళు తెరిచీ తెరవగానే పరిస్థితి ఆకళింపు చేసుకున్నాడు. మరి మంచం మీదుంటే డేంజర్ అని మెరుపులా దూకి మంచం కిందకు దూరిపోయాడు – లావుపాటి అమ్మ మంచం కిందకు రాలేదన్న ధైర్యంతో.

'చదువూ చట్టుబండలూ ఏవీ అక్కర్లేదా? ఎనిమిదైనా గాడిదలా అలా నిద్రపోతున్నావు?' అని చీపురు మంచం కిందకు ఓసారి విసిరింది కామాక్షి.

చీపురుకందని సేఫ్ డిస్టెన్సులో పడుకున్న కిట్టిగాడు 'ఏవైందే ఇప్పుడు? బంగారం లాంటి నిద్రపాడు చేశావు?' అన్నాడు విసుగ్గా.

'ఏవైందా? నీ ప్రొగ్రెస్ కార్డు ఏదీ? రేంకు ఎంతొచ్చిందీ?'

'ఓహో అదా!' అన్నాడు కిట్టిగాడు కొట్టిపారేస్తూ.

'ఓహో అదా అంటావా?' – చీపురు మంచం కిందకు ఓసారి విసిరి అంది కామాక్షి – 'చిట్టిగాడు చెబుతుంటే సిగ్గుతో చచ్చిపోయాను'.

'వాడికెంతొచ్చిందో అడిగావా?' తాపీగా అన్నాడు కిట్టిగాడు.

'ఎంత?'

'నాకు ఫస్టు! వాడికి సెకండు'

'ఆరి వెధవా! ఎంత స్టైలుగా చెప్పాడు, వాడికేదో బాగా మార్కులొచ్చినట్లు' అని ఆశ్చర్యపోయి. 'అంతా అమ్మ పోలికలే' అంది మెటికలు విరుస్తూ. మెటికలు విరిచే ప్రయత్నంలో చేతిలో ఆయుధం కిందకు వదిలేసింది.

'అసలు నాకంటే టీచరు వాడినే గట్టిగా కొట్టింది తెలుసా?' – అమ్మ శాంతించిందనే ధైర్యంతో మంచం కిందనుంచి బయటకు పాకి, మళ్ళీ మంచం ఎక్కి బాసింపట్టు వేసుకుని కూర్చుంటూ అన్నాడు కిట్టిగాడు.

'ఎందుకు?'

'నీకేం ఒళ్ళు పొగ్రరా? కిట్టిగాడిలా కాదు – చదివితే నీకు మంచి రేంకే వచ్చేది అంటూ వాణ్ణి బాగా ఉతికేసింది' అని వివరించాడు కిట్టిగాడు సంతోషంగా.

'ఛ! వెధవా! ఆ మాటనడానికి నీకు సిగ్గెయ్యడం లేదురా?' అంటూ మళ్ళీ చీపురందుకుని ఒకటేసి, 'ఛ... ఛ.... ఇంత జరిగాక ఈ వీధిలో తలెత్తుకు తిరగలేను' అంది ముక్కు చీదుతూ, 'ఇంత జరిగాక' అన్న మాట వత్తి పలుకుతూ.

స్నానం చేసి గదిలోకి వస్తున్న రామ్మూర్తి ఆవిడ ఏ ఉద్దేశంతో ఆ మాటన్నదో అర్థం చేసుకుని, ఆ స్కూటరు సంగతి మళ్ళీ గుర్తుకు రాకుండా మాట మార్చే ఉద్దేశంతో కిట్టిగాడి దగ్గరకొచ్చి, 'ఏరా కిట్టిగా! ఇండిపెండెన్సు మీద ఎస్సే టీచరుకి చూపించావురా?' అని గదమాయించాడు.

'పొద్దుటే నాతోటి పెట్టుకోకు డాడీ! అమ్మ సంగతి చూశావు కదా!' అన్నట్లు కీచకుణ్ణి ఓడించిన భీముడు ఉప కీచకుల్ని చూసినట్టు తండ్రి కేసి ఓసారి చూసి మౌనంగా ఉండిపోయాడు కిట్టిగాడు.

'ఏమందిరా మీ టీచరు?' రామ్మూర్తి గద్దించాడు.

ఇక తప్పనిసరైనట్లు నోరు విప్పాడు కిట్టిగాడు – 'ఇండిపెండెన్స్ స్పెల్లింగ్ వందసార్లు ఇంపోజిషన్ రాయమంది'

'నిన్నా?'

'నన్ను కాదు, నిన్ను' అన్నాడు కిట్టిగాడు శాంతంగా.

'నేను రాసేనని చెప్పేశావా?'

'చెప్పక్కర్లేదు – హోంవర్కు పేరెంట్సే చేస్తారని అందరికీ తెలుసు'.

'అంటే – నేను రాసేనని తెలిసే అలా అందా?'

'అది తెలిసే అంది. అంతే కాదు...' – కిట్టిగాడు సస్పెన్స్ సీరియల్ రచయితలా హఠాత్తుగా ఆగిపోయాడు.

'చెప్పు' – రామ్మూర్తి సస్పెన్సు భరించలేక అరిచాడు.

'వద్దులే – బాధపడతావు'.

'చెప్పి చావు – లేకపోతే చంపేస్తా'.

'వెనుక వీధిలో కృష్ణారావు....'

'ఎవరు? ఎల్డీసి కృష్ణారావా?' – నిరసనగా అంది కామాక్షి.

'ఆయనే! ఆయన దగ్గర ఎస్సే ఎలా రాయాలో నేర్చుకోమంది'.

షాక్ తగిలినట్లు నోరు తెరిచాడు రామ్మూర్తి – 'నన్నా?'

'మరి నన్నా?'

తండ్రీకొడుకుల సంవాదం వింటున్న కామాక్షి కలుగజేసుకుంది – 'నాన్నగారు సెంట్రల్ గవర్నమెంటులో గెజిటెడ్ ఆఫీసరని చెప్పావా?'

'అదీ చెప్పాను'

'ఏమంది?'

'నిజం చెబితే బాధపడతారు. ఇంకా మొహం కడుక్కోలేదు – పొద్దుటే నా చేత అబద్ధాలు చెప్పించకే' అన్నాడు కిట్టిగాడు దీనంగా.

'వెధవా! నిజం చెప్పకపోతే చంపేస్తా'

చెప్పక తప్పదా అన్నట్లు కిట్టిగాడు ఓ సారి తండ్రికేసి చూసి – 'దేశం అందుకే ఇలా ఏడుస్తోంది, అంది' అన్నాడు.

కిట్టిగాడు 'కీ' ఇవ్వగానే రామ్మూర్తి నిప్పు తొక్కిన కోతిలా గంతులెయ్యడం మొదలుపెట్టాడు. 'సెంట్రల్ గవర్నమెంటంటే ఏమనుకుంటోందో మీ టీచరు! ఎడ్యుకేషన్ మినిష్టరుతో మాట్లాడి స్కూలు మూయించేస్తాను.... వెధవా... నువ్వు నోరిప్పకు.... నువ్వు మాట్లాడితే నా బీపి పెరిగిపోతోంది... చెప్పేది విను... పార్లమెంటులో ప్రివిలేజ్‌మోషన్ పెట్టిస్తాను... గవర్నరుతో మాట్లాడి స్టేట్ గవర్నమెంటును డిస్మిస్ చేయిస్తాను.... సెంట్రల్ గవర్నమెంటంటే అంత అలుసా?' అని చిందులు తొక్కుతుండగా–

'అందుకే స్కూటరు కొనమంటే వింటున్నారా? అని అంటున్నాను. లేకపోతే వీధిలో తలెత్తుకు తిరగ్గలమా?' అంది కామాక్షి దుఃఖంతో, ఈ దుఃఖాన్ని ఆ దుఃఖంతో ముడిపెడుతూ.

'బోడిగుండుకీ, మోకాలికీ ముడేసి ఏడుస్తావు – దానికీ దీనికీ సంబంధమేమిటే?' అని పెళ్ళాన్ని విసుక్కుని ఆ పూటకి స్కూటరు విషయం వాయిదా వేసినా, ఆ మధ్యాహ్నం జరిగింది విన్నాక అతనికి కూడా చుర్రుమంది.

మధ్యాహ్నం రెండవుతుండగా కామాక్షి ఇంట్లో ఫోను మోగింది.

'హలో' అంది కామాక్షి ఫోను తీసి.

'నేను మీనాక్షిని'

ఇంకా చెప్పాల్సిందేవన్నా ఉందా తల్లీ అనుకుంటూ మౌనంగా ఉండిపోయింది కామాక్షి. కామాక్షి మాట్లాడకపోయినా మీనాక్షే మాట్లాడింది – 'మా చెల్లెలు పెళ్ళి నిశ్చయమైంది. ఇప్పుడే ఉత్తరం వచ్చింది'.

'చాలా సంతోషం' – తేలికపడ్డ హృదయంతో అంది కామాక్షి. మళ్ళీ ఏ బాంబూ పేల్చనందుకు నిజంగానే సంతోషిస్తూ 'ఇదివరకు అనుకున్న సంబంధవేనా?' అనడిగింది. మీనాక్షి ఈసారి ఆటంబాంబు పేల్చబోతున్నదని ఆవిడకు తట్టలేదు.

'ఆ సంబంధం కాదు. ఆ సంబంధం మా చెల్లెలికి ఇష్టం లేదు' – తాపీగా మొదలు పెట్టింది మీనాక్షి.

'ఏం? కుర్రాడు బాగోడా?'

'కుర్రాడికేం? బంగారంలా ఉంటాడు. కాని మా చెల్లెలికే ఇష్టం లేదు. అక్కడికీ మేమందరం 'కుర్రాడు చాలా బుద్ధిమంతుడే, సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగమే- గెజిటెడ్ ఆఫీసరు కూడానూ' అని నచ్చచెప్పాం. అయినా అది వినందే. అక్కకి చక్కగా మంచి సంబంధం చేసి నన్ను గవర్నమెంట్‌లో ఉద్యోగం చేసుకునే వాడికిచ్చి చేస్తారా? నా సరదాలేవీ తీరక్కర్లేదా? ఈ సంబంధం ఖాయం చేస్తే నూతిలో దూకుతానంది మా చెల్లి. ఈ కుర్రాడు డన్లప్ కంపెనీలో... హలో... హలో... ఆ కంపెనీలో ....లోహ లో... హ లో....' ఫోను హఠాత్తుగా కట్ అవడంతో మీనాక్షి సంతోషంగా ఫోను పెట్టేసింది.

సాయంత్రం రామ్మూర్తి ఆఫీసు నుంచి రాగానే అంతా చెప్పి, 'ఎంత మాటందో చూశారా మిమ్మల్నీ, మీ సెంట్రల్ గవర్నమెంటునీ? గవర్నమెంటు ఉద్యోగం చేసేవాడైతే సరదాలేవీ తీరవుట! అదీ నిజమేలెండి. స్కూటరు కొనగలిగారా మీరు – నా కర్మ' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది కామాక్షి.

రామ్మూర్తికి ఆవేశం పొంగుకొచ్చి, ఆలోచన వెనుకబడి 'రేపే స్కూటరు తీసుకొస్తా' అని ప్రతిజ్ఞ చేసి మర్నాడే స్కూటరు తీసుకొచ్చేశాడు.

అప్పటినుంచి ప్రారంభమయ్యాయి అతని కష్టాలు.

ఓ వారం రోజులు నడపడం నేర్చుకోవాలంటూ గడిపినా, రెండోవారం ఆఫీసుకు స్కూటరు మీద వెళ్ళితీరాలని పట్టుబట్టింది కామాక్షి.

ఇల్లు దాటి ఓ ఫర్లాంగు వెళ్ళాడో లేదో, శకున పక్షి శంకర్రావు టిఫిను కేరియర్ పట్టుకుని ఎదురయ్యాడు.

వెధవ శకునం అని మనసులో అనుకుని 'ఆఫీసుకేనా?' అని పలుకరించాడు.

'కాదు హాస్పిటల్‌కి'

'ఏం?'

'ఏం అంటే ఏం చెప్పను... కర్మ! నిక్షేపంలా ఉండే మా తోడల్లుడి మేనల్లుడు ఏరికోరి పీకలమీదకు తెచ్చుకున్నాడు. వద్దురా అంటే వినకుండా స్కూటరు కావాలని ప్రాణం తీసి, ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు...'

రామ్మూర్తి గుండెల్లో రాయి పడింది – 'ఏమైంది?'

'ఏక్సిడెంటయ్యింది. కాళ్ళు విరిగాయి. అన్నట్లు కొత్త స్కూటరు కొన్నావుట కదూ' అన్నాడు జాలిగా రామ్మూర్తి కాళ్ళకేసి చూస్తూ.

రామ్మూర్తి ఇబ్బందిగా కదిలి 'సాయంత్రం కలుద్దాంలే' అన్నాడు స్కూటరు స్టార్టు చేస్తూ.

'ఎక్కడ? హాస్పిటల్‌లోనా?'

'శకున పక్షి వెధవ. అపశకునపు మాటలూ వీడూను' అని గిజగిజలాడి శంకరాన్ని వదిలించుకుని, ఓ అరకిలోమీటరు దడదడలాడుతూ ఎలాగోలా నడిపించి సెంటర్‌లో ట్రాఫిక్ భయంభయంగా చూస్తూ ఆగిపోయాడు రామ్మూర్తి.

'ఏవిటి అంకుల్? ఆఫీసుకేనా...' రామ్మూర్తి స్నేహితుడి కొడుకు కాలేజీకి వెడుతూ రామ్మూర్తిని చూసి ఆగి అడిగాడు.

'ఆ... ఆ....' అన్నాడు రామ్మూర్తి పరధ్యానంగా.

'మా బస్సు ఈ వేళ మిస్సయింది. నాకు లిఫ్టు ఇస్తారా?'

'తను దూర కంత లేదు, మెడకో డోలట' అనుకుని 'ఇవ్వను' అనబోతుండగా బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది.

'దానికేం భాగ్యమోయ్!' అని ఎగిరి వెనక సీటుమీద కూర్చున్నాడు రామ్మూర్తి.

'నన్ను నడపమంటారా?' అన్నాడు ఆ కుర్రాడు తలగోక్కుంటూ.

'నడపవోయ్ నడుపు. ఇవేళ స్కూటర్లు, విమానాలు నడిపి రేపు దేశాన్ని నడిపే యువతరం మీది. నడుపు. బస్సులో కాలేజికి ఏం వెడతవు కాని రోజూ ఈ టైముకే

ఇక్కడ నిలబడుతూ ఉండు. మరిచిపోకు. నడుపు... నడుపు... కమాన్....' కుర్రాణ్ణి తొందర చేశాడు రామ్మూర్తి.

ఉదయం ఆఫీసుకు వెళ్ళే సమస్య అలా తీరిపోయింది.

సాయంకాలం కిళ్ళీ కొట్టు దగ్గర కిళ్ళీ వేసుకుని, సిగరెట్ కాలుస్తూ, ఇంటికి వెళ్ళేవాళ్ళు ఎవరు దొరుకుతారా అని ఎదురుచూస్తుంటే, డి.డి. రావు ధన్ ధన్ మని వచ్చేశాడు. – 'ఏవిటి గురువుగారూ! ఇక్కడ నిలబడ్డారు. ఇంటికి వెడదామా?'

'నీకు స్కూటరు నడపడం వచ్చా?'

'స్కూటరేవిటి? కారు, బస్సు, రైలింజను, రాకెట్ – అన్నీ నడిపెయ్యగలను. ఇదేవన్నా బ్రహ్మ విద్యా?'

రామూర్తికి పట్టరాని సంతోషం కలిగింది – 'అయితే పద' అన్నాడు వెనుక సీటు మీదకు దూకుతూ.

డీడీరావు స్కూటరుకి కిక్కిచ్చి కూర్చుని, నూతిలో మోటారు సైకిలు తొక్కేవాడిలా ఏక్సిలరేటరు ముందుకీ వెనక్కీ తిప్పి బర్రుబర్రుమనిపించి 'గేరెక్కడ సార్?' అనడిగాడు.

'నీకు అసలు స్కూటరు నడపడం వచ్చా ధనా ధన్?' అనుమానంగా అడిగాడు రామ్మూర్తి.

'ఇంతకుముందు నడపలేదుగాని ఇప్పుడు నేర్చుకుంటాగా! రైలింజనూ, రాకెట్టూ నడిపేవాణ్ణి – నాకిదొక లెక్కా? గేరెక్కడ?' అని గేరు ఎక్కడుందో తెలుసుకుని, 'రైట్... ఫైవ్.... ఫోర్.... త్రి.... టు....వన్...' అని కౌంట్ డౌన్ మొదలుపెట్టాడు డీడీరావు.

కౌంట్‌డౌన్ పూర్తవగానే స్కూటరు ముందుకు దూకింది. రామ్మూర్తి కళ్ళు మూసుకున్నాడు. అదృష్టవశాత్తూ రోడ్డు ఖాళీగానే ఉంది. దానిమీద శరవేగంతో స్కూటరు పరుగెడుతోంది.

'బండి పికప్ బాగుంది సార్' కొంచెం స్పీడ్ పెంచుతూ అన్నాడు డీడీరావు 'గాలిలో తేలిపోతున్నట్టుంది'

కొంచెం ధైర్యం పుంజుకుని కళ్ళు తెరవగానే ఎదురుగా, దూరంగా లారీ కనిపించి 'డీడీ.... లారీ...' అన్నాడు రామ్మూర్తి కంగారుగా.

'లారీ ఎక్కడ సార్? కలలు గంటున్నారా?' అన్నాడు డీడీ చిరునవ్వుతో స్పీడు మరికొంచెం పెంచుతూ.

'కలాకాదు, నీ బొందా కాదు. ఎదురుగా దెయ్యంలా వస్తోంది'

'మరి నాకు కనిపించదే' అని ఆశ్చర్యపోయి, 'అదీ సంగతి గురువుగారూ! కళ్ళజోడు పెట్టుకోవడం మరిచిపోయాను' అని రెండు చేతులూ హాండిల్ బార్ మీంచి తీసేసి షర్టు జేబులూ, పాంటు జేబులూ అన్నీ వెదకడం మొదలుపెట్టాడు డీడీ.

'డీడీ..... నిన్ను తగలెయ్య.... బ్రేకు వెయ్యవయ్యా....'

'అన్నట్టు... బ్రేకు ఎక్కడుంది సార్?' పాంటు జేబులోంచి సోడాబుడ్డి అద్దాల కళ్ళజోడుతీసి, తగిలించుకుంటూ అడిగాడు డీడీ.

'.... బె... బె... బ్రేకా?' రామ్మూర్తి నోరు తెరిచాడు.

'బ్రేకు' - డీడీ వివరించసాగాడు - '.... అది నొక్కితేనే కదా స్కూటరు ఆగేది'

'కుడికాలి కింద' అన్నాడు రామ్మూర్తి ఏడుపు గొంతుతో, డీడీకి బ్రేకు ఎక్కడుందో కూడా తెలియదన్న సంగతి అప్పుడే అర్థమై.

కుడికాలు ఏదా అని క్షణం ఆలోచించి, గుర్తు వచ్చాక కుడికాలు కింద బ్రేకు చూసి చిరునవ్వు నవ్వాడు డీడీ. దగ్గరవుతున్న లారీని చూసి కళ్ళు మూసుకున్నాడు రామ్మూర్తి

కళ్ళజోడు సర్దుకుని చూసేటప్పటికి పది గజాల దూరంలో లారీ భూతంలా కనిపించి 'అందుకే పాపం గురూగారు అంత కంగారుపడ్డారు' అనుకుని, బ్రేకు గట్టిగా నొక్కాడు డీడీ.

లారీ ఇంకో అయిదు గజాల దూరంలో ఉందనగా, తిన్నగా వెడుతున్న స్కూటరు హఠాత్తుగా నూటెనభై డిగ్రీలు తిరిగి మళ్ళీ పరుగెత్తసాగింది. ఆ కుదుపుకు డీడీ కళ్ళజోడు జారి ఒళ్ళో పడిపోయింది.

'సార్!' - ఒళ్ళోపడ్డ కళ్ళజోడు వెతికి మళ్ళీ తగిలించుకుని అటూ ఇటూ చూసి గావుకేక పెట్టాడు డీడీ.

ఆ కేక విని కళ్ళు తెరిచాడు రామ్మూర్తి.

'ఇదేవిటి సార్! ఇంటికెళ్ళాల్సింది పోయి మనం మళ్ళీ ఆఫీసుకొచ్చేశాం' అన్నాడు డీడీ ఆశ్చర్యంగా చూస్తూ.

'ధనాధన్'

'సార్!'

'స్కూటరాపు'

'బ్రేకు....'

'కుడికాలికింద చచ్చింది.... మెల్లిగా నొక్కు'

ఈసారి స్కూటరు లాంగ్ జంప్ చేసి ఫుట్ పాత్ ఎక్కి ఆగిపోయింది.

'నాయనా ధనాధన్!' – స్కూటరు మీంచి దిగి గుండెలు రుద్దుకుంటూ అన్నాడు రామ్మూర్తి.

'ఏవిటి సార్?'

'నువ్వు స్కూటరు నడిపితే నడిపావుగాని రాకెట్టు మాత్రం ఎప్పుడూ నడపకు'– పళ్ళు పటపటలాడిస్తూ అన్నాడు రామ్మూర్తి – 'చంద్రమండలానికి బయలు దేరి సూర్య మండలంలో దిగిపోగలవు – జాగ్రత్త!'

'భలే జోకేశారు సార్! ఈ సారి.... ' అని మళ్ళీ స్కూటరు దగ్గరకు రాబోతుంటే ఆపుచేసి, 'ఈసారి స్కూటరు మీద చెయ్యేసేవంటే కాళ్ళూ చేతులూ విరిచేస్తా' అని వార్నింగిచ్చి, తెగించి తనే బయలుదేరాడు రామ్మూర్తి.

మొదటిరోజు ఏ అవాంతరం లేకుండా ఇంటికి చేరాడు రామ్మూర్తి.

రెండోరోజు సైకిలు గుద్దేశాడు.

మూడోరోజు రెడ్ లైటు దగ్గర ఆగినప్పుడు బస్సు వెనుకనుంచి గుద్దింది.

అయిదారురోజులు సొట్టలు తీయించి బాగుచేయించాడు.

ఏడోరోజు మళ్ళీ ఏవీ జరగలేదు.

ఎనిమిదోరోజు ఓ కోడి, తొమ్మిదోరోజు ఓ కుక్కా స్కూటరుకి బలైపోయాయి.

పదో రోజు సగం దూరం వెళ్ళాక ఓ లారీ రామ్మూర్తి వెంటపడింది. లారీ డ్రైవర్, ఆర్డీ బర్మన్ లా హారను మీంచి చెయ్యి తియ్యకుండా 'దమ్మరో దమ్' పాట 'బొంబోరో బోం' అని వాయించ సాగాడు.

'వీణ్ణి తగలెయ్య! చెవిలో జోరీగలా తగులుకున్నాడు' అనుకున్నాడు రామ్మూర్తి కంగారుగా.

మరో రెండు నిమిషాల్లో లారీ పక్కకి ఓ టాక్సీ వచ్చింది. టాక్సీ డ్రైవర్‌కి ఆర్డీ బర్మన్ సంగీతం వినగానే కోపం వచ్చింది. నేనేమైనా తీసిపోయానా అని హరీ.... హ రీ..... పిపీ.... పిపీ ....' అని ఓ దరువు వేశాడు.

తన్మయత్వంతో సంగీత సాధన చేస్తున్న లారీ డ్రైవరు ఏకాగ్రతకి అంతరాయం కలిగి వాడికి కోపం వచ్చింది.

'బొబ్బో.... బొబ్బోబొ....' అని వాయించాడు గట్టిగా.

'పిపి... పిపీ... పిపీ....' అంతే పొడవుగా సమాధానమిచ్చాడు టాక్సీ డ్రైవర్.

'భోం.... భోం.... భోం.... భోం....'

'పిపీ.... పిపీ.... పిపీ.... పిపీ...'

'ఇంక భరించలేను బాబోయ్' – స్కూటరు మీదున్న సంగతి మరిచిపోయి రెండు చేతులతోనూ చెవులు మూసుకున్నాడు రామ్మూర్తి.

అంతే! స్కూటరు రోడ్డు వదలి పక్కన ఇసుకలో ప్రవేశించి, జర్రున జారి రామ్మూర్తిని దబ్బున పడేసింది.

'అబ్బా!' అన్నాడు రామ్మూర్తి చట్టపట్టుకుంటూ....

✧ ✧ ✧

మర్నాడు ఉదయం వేణ్ణీళ్ళ కాపడం పెట్టించుకుని, మంచంమీద పడుకుని విశ్రాంతి తీసుకుంటుండగా తొమ్మిదింటికి కాలింగ్ బెల్లు మోగింది.

'గురూ గారున్నారా?' పరమశివం గొంతుక వినిపించింది.

'ఆ....' అని కామాక్షి సమాధానం ఇచ్చి – 'ఆయనకు మీరు స్కూటరు మీంచి పడ్డట్టు చెప్పకండి' అని హెచ్చరించి హాల్లోకి పంపించింది రామ్మూర్తిని.

'ఏమోయ్ పరమశివం..... అబ్బ....బాగున్నావా.... అమ్మా... స్కూటరు బాగుందా... అబ్బా.....'

'గురూగారూ! ఒకసారి బయటికి వస్తారా? మీతో అర్జెంటుగా మాట్లాడాలి' అన్నాడు పరమశివం ప్రాధేయపూర్వకంగా. పలకరిస్తే ఏడ్చేసేలా ఉన్నాడతను.

'పద' అన్నాడు రామ్మూర్తి బయటకు నడుస్తూ.

'గురూగారూ! మీ మాటేమో కాని... నాకు... వెధవ స్కూటరుతో చాలా ట్రబులుగా ఉంది. ఉదయాన్నే లేచి స్కూటరు చూస్తే బీపీ పెరిగిపోతోంది. టెన్షన్ వచ్చేస్తోంది. రోజూ ఏదో ఏక్సిడెంటు.... నిన్న మటుకు నిన్న...' పరమశివం లాల్చీ పైజామాలు పైకి మడిచి మోచేతులూ, మోకాళ్ళూ చూపిస్తూ అన్నాడు – '.... ఇలా అయింది'.

'నీ కంటే ... నేనే.... అమ్మ... నయం అన్నమాట.... అబ్బా'

'గురూగారూ! ఇవి కాళ్ళు కాదు.... సారీ... చేతులు కాదు... కాళ్ళనుకోండి' రామ్మూర్తి చేతులు పట్టుకుని దీనంగా అన్నాడు పరమశివం– '.... మీ కో ఆపరేషను

కావాలి. మీ ఇంట్లో స్కూటరున్నంత కాలం మా ఆవిడ నేను చచ్చిపోయినా సరే స్కూటరు అమ్మనివ్వదు....'

'మా రాక్షసీ... అమ్మా.... అంతే.... ఈ పీడ వదిలే ఐడియా.... అబ్బా.....ఏదైనా చెప్పు.... అమ్మా...'

'దానికో బ్రహ్మాండమైన ప్లానేశాను గురూగారూ'

పరమశివం ప్లాను విని ఆనందం పట్టలేక రామ్మూర్తి అతన్ని కౌగిలించుకుని– 'ఎలాగైనా బ్రెయినంటే నీదే పరమశివం! ఈ ఐడియా నాకింతవరకూ రాలేదు సుమా' అన్నాడు అభినందిస్తూ.

'థ్యాంక్యూ గురూగారూ'

✧ ✧ ✧

మర్నాడు ఇంట్లో ఎంత చెప్పినా వినక రామ్మూర్తీ, పరమశివం స్కూటర్ల మీద ఆఫీసుకు బయలుదేరారు. సాయంకాలం ఇద్దరూ క్షేమంగా తిరిగి వచ్చారు కాని స్కూటర్లు రాలేదు. ఇద్దరికీ ఘోరమైన ఏక్సిడెంట్లు జరిగి స్కూటర్లు తుక్కు తుక్కు అయిపోయాయిట. ఇక ఇన్సూరెన్సు డబ్బు తీసుకోవటం తప్ప చేయగలిగిందేవీ లేదుట. ఎవరింట్లో వాళ్ళు చెప్పిన కథ ఇది.

'ఫాదర్ మాట నమ్మబుల్‌గా లేదు....' అన్నాడు కిట్టిగాడు అనుమానంగా.

'ఏం?....' అన్నాడు రామ్మూర్తి ఖంగుతిని.

'స్కూటరు తుక్కు తుక్కు అయి వర్క్‌షాపుకి పోతే నడిపేవాడు హాస్పిటల్‌కి వెళ్ళాలిగాని ఇంటికెలా వస్తాడు?' – లాయరులా ప్రశ్నించాడు కిట్టిగాడు.

'ఏరా వెధవా! నేను హాస్పిటల్‌కి వెళ్ళలేదని బెంగెట్టుకున్నావా? డొక్క చీరేస్తా వెధవా, వెధవ మాటలు మాట్లాడితే... ఇక నోరు మెదపకు... వెళ్ళి చదువుకో.... వెధవ తెలివితేటలన్నీ చదువులో చూపించు....' అని కిట్టిగాడు నోరెత్తే అవకాశం ఇవ్వకుండా తరిమేశాడు రామ్మూర్తి.

'పోతే పోయిందిలెండి వెధవ స్కూటరు! మీరు క్షేమంగా వచ్చారు. అంతే చాలు. అయినా ఎదురింటి వాళ్ళు స్కూటరు కొన్నారని పోటీపడి మనం కూడా స్కూటరు కొనుక్కోవడవేమిటి, బుద్ధిలేకపోతే....'

'ఏవిటీ దెయ్యం ఇలా మారిపోయింది' అని రామ్మూర్తి నోరు తెరిచి చూస్తుండగా అంది కామాక్షి – '..... స్కూటరు కొనడవేమిటీ బుద్ధిలేకపోతే – కారు కొనాలిగాని...'

కామాక్షి మాట పూర్తి కాకుండానే టెలిఫోన్ గణగణా మోగింది. అది మీనాక్షి అని ఊహించి ఫోను వెంటనే తీసింది. కారు విషయం మీనాక్షికి చెప్పాలని చాలా ఆత్రంగా ఉంది కామాక్షికి.

'నేను మీనాక్షిని వదినగారూ! రవ్వదోసె ఎలా చెయ్యాలో కనుక్కుందామని...'

'సమయానికి ఫోను చేశావు. నేనే నీకు ఫోను చేసి...'

'బొంబాయి రవ్వ... ఇంకా...'

'బొంబాయి రవ్వ, వరిపిండి, మైదా – మూడూ మూడు కప్పులు పోసి.... ఫోను చేసి ఓ ముఖ్యమైన విషయం చెబుదామని...'

'..... మూడు కప్పులు.....'

'..... మజ్జిగలో కలిపి ఓ గంటసేపు నాననిచ్చి..... ఇంతకీ నే చెప్పేదేమి టంటే.....'

'గంటసేపు నాననివ్వాలా?' – కామాక్షికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మీనాక్షే త్వరత్వరగా అంది – '..... అన్నట్టు చెప్పడం మరిచిపోయాను వదినగారూ! మేం మారుతీకారు కొందామనుకుంటున్నాం. ఎరుపైతే బాగుంటుందా లేక క్రీం కలరైతే....'

మాట పూర్తి కాకుండానే దబ్బుమని చప్పుడై ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది మీనాక్షి. సోఫాలో స్పృహ పడి ఉన్న పరమశివాన్ని చూసి ఆశ్చర్యపోయి 'ఇప్పటిదాకా రాయిలా ఉన్నారు కదా! ఏవైంది?' అనుకుని ఫోను పెట్టేసి సోఫా వైపుకి నడిచింది మీనాక్షి.

అదే సమయంలో ఎదురింట్లో కామాక్షి రామ్మూర్తిని కుదుపుతూ 'ఏవైందండీ' అంటుంటే 'ఏమీ లేదు మమ్మీ! కారు అనే సరికి డాడీకి షాక్ తగిలినట్లుంది' అన్నాడు కిట్టిగాడు నేలమీద పడున్న రామ్మూర్తిని చూస్తూ.

*(ఆంధ్రప్రభ వారపత్రిక, మే 5, 1989)*